# పంచమి చంద్రుడు

సడన్ బ్రేక్ వేసాడు డ్రైవర్. కారు ఆగిన కుదుపుకు మెలుకువ వచ్చింది మధుకి. బరువెక్కిన కళ్ళని బలవంతంగా విప్పి చూసాడు.

జీవితాన్ని మేలుకొల్పి ముందుకు నడిపించిన వెలుగుని, చీకటి కాటేసింది. స్పృహతప్పి పడిపోయిన వెలుగు మీద నల్లని దుప్పటి కప్పి ఏడుస్తోంది భూదేవి.

కారుకు అడ్డంగా పడుకున్న ఆవు దూడని లేపి కారు స్టార్టు చేసాడు డ్రైవర్. సుపరిచితమైన రోడ్డు మీద పరుగెత్తింది కారు.

అప్పుడప్పుడే దహనానికి మృతదేహాన్ని తీసికెళ్ళిన ఇల్లులా ఉంది. ప్రశాంతంగానూ, నిర్మానుష్యంగాను కనిపించిన రోడ్డు. మంచి స్నేహితుని ఓదార్పులా, చల్లగా వీచింది చిరుగాలి. బరువెక్కిన మధు కళ్ళు మూతలు పడ్డాయి. పట్టీ పట్టని నిద్రలో ఏవో రూపాలు, మాటలు......

"నువ్వు చాలా అదృష్టవంతుడివిరా" రెండు నెలల క్రితం అన్నాడు ప్రసాద్. ప్రసాద్ మధు క్లాస్ మేట్. ఓ కంపెనీలో మామూలు ఇంజినీరుగా పనిచేస్తున్నాడు.

"దేనికయనా రాతనేది ఒకటి ఉండాలిరా" అతని కోరికల్లాగే వలయాలు వలయాలుగా ఎగిరిపోతున్న సిగిరెట్టుపొగను చూస్తూ వేదాంతిలా అన్నాడు వాడు.

"నీకేం తక్కువైందని అలా బాధపడుతున్నావురా"

"తక్కువైందని కాదురా. నేను బాధపడుతున్నానని అనుకుంటున్నావా? లేదు. లేదు." ప్రసాద్ మళ్ళీ అన్నాడు. "నువ్వు బాగుపడితే అది నాకు ఆనందమే కదరా అయినా నిండా పన్నెండేళ్ళ అనుభవం కూడా లేని నీకు జనరల్ మేనేజర్ ఉద్యోగం ఎలా వచ్చిందిరా అని......"

నిజమే! పన్నెండేళ్ళ అనుభవం కూడా లేని మధుకు జనరల్ మేనేజర్ పదవి రావటం అదృష్టమే. అందులోనూ, మంచి పేరు,

ప్రఖ్యాతులున్న ఒక భారీ రసాయన కర్మాగారములో జనరల్ మేనేజర్ పదవి రావటం అంటే మాటలా! బంగాళా, కారు, హోదా అన్నీ వచ్చాయి ఆ ఉద్యోగంలో కానీ ......

కానీ బ్రతుకే కరువైంది. అది ప్రసాద్‌కి తెలీదు కదా!

గాఢంగా నిట్టూర్చాడు మధు. ఆపదవిలో చేరటానికి జీవితంలో ఏమేమి త్యాగం చేసా నన్నది ఎవరికీ తెలీదు కదా. అతనికి తప్ప!

మధు పెళ్ళి తర్వాత పనిలోకి వెళ్ళిన మొదటి రోజది. అప్పుడ-ప్పుడే వెలుతురు వస్తున్న డిసంబర్ నెలలో ఉదయం. అతని గురించి అప్పుడప్పుడే తెలుసు కుంటున్న భార్యమనస్సులా తోచింది మధుకి.

"అప్పుడే ముస్తాబయి పోయారేంటీ?" మధు శ్రీమతి అడిగింది.

"ముస్తాబవక పోతే ఎలా? టయిమయిపోయింది. ఏడు కల్లా ఆఫీసులో ఉండాలి."

ఆవిడ అతన్ని అదోలా చూసింది. తర్వాత మెల్లగా అంది "ఇంకా పూర్తిగా తెల్లవార లేదండి. పనిమనిషి కూడా రాలేదు."

మధు ఏం మాట్లాడలేదు బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు.

"ఇంత పెందరాళే బయలు దేరుతారనుకోలేదండీ." గబగబా కాఫీ కలుపుకు వచ్చి పొరపాటు చేసిన దానిలా పలికింది అతని భార్య.

"పోనీలే సుజా" మధు అన్నాడు "నిన్ననేగా మా ఇంటికి వచ్చావు. నా ఉద్యోగం గురించి, పద్ధతుల గురించి మెల్లగా తెలుసు కుంటావులే." కాఫీ సిప్ చేస్తే మళ్ళీ అన్నాడు. "మేనేజర్ అంటే తాపీగా ఆఫీసు కెళ్ళి వచ్చేస్తాననీ, ఉద్యోగం ఏదో సరదాగా ఉంటుందని అనుకొన్నావేమో. చాలా పొరబడ్డావు. నువ్వు ఇందాక చెప్పిన పనిమనిషిలాంటి వాళ్ళమే, మేము కూడా పెద్దపని వాళ్ళం."

కాఫీ కప్పు కింద పెట్టాడు మధు. తలుపు తెరచుకొని బయటకు అడుగు వేస్తూ మళ్ళీ అన్నాడు "ఇంకా వాళ్ళ పనే బాగుంటుం-దేమో. రేపటి గురించి బాధ బెంగ లేవు ఓ పని పోతే ఇంకో పని దొరక దన్న భయం లేదు." అతను స్కూటర్ స్టార్ట్ చేసాడు.

* * *

"నేను ఐదుగంటల నుంచి వెయిట్ చేస్తున్నాను తెల్సా." సాయంత్రం ఇంటికి చేరగానే సుజా మొహం ముడుచుకొని అంది.

"ఏం చెయ్యను సుజా?" టీ.వి. ఆన్ చేస్తూ అన్నాడు మధు. "ఏదో ఒక పని......"

టీ.విలో ఆంగ్లంలో వార్తలు వినిపించాయి.

"పని ఎప్పుడూ ఉంటునే ఉంటుందిలెండి. అయినా నాకు తెలీ-కడుగుతున్నాను. మీ ఆఫీసుకు టైం ఒకటుందా?"

"ఎందు కుండదూ? గానీ అది మాకు వర్తించదు. అంతే."

"ఎందుకని......"

"ఎందుకనా? కంపెనీ నడపవలసినది మేనేజర్లు కనుక. అయినా సుజా నేను చేసేది ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం టయిమూ, గియిమూ అంటే ఎలా కుదురుతుంది చెప్పు."

సుజా ఏమీ అనలేదు.

ఆకాశమార్గాన ఉన్న పున్నమి చంద్రుని ఓ మబ్బు తునక అడ్డి-నట్లుంది. మాగదిలో అంత వరకు కురిసిన వెన్నెల వెలుగు కొద్దిగా తగ్గిపోయింది.

"అయితే ఇంతేనన్న మాట." సుజా అంది. "మీకు ఉద్యోగమే బ్రతుకన్న మాట."

"అలా అని కాదు." ముందు బాల్కనీలోకి వచ్చి కూర్చొని అన్నాడు మధు. "జీతం కోసం అమ్ముడు పోయిన వాడిని. తప్పుతుందా?"

సుజా అతన్ని అనుసరించి బాల్కనీలోకి వెళ్ళలేదు.

ప్రియునితో కలహించిన రాత్రి, తన మబ్బుల జడని విరబోసుకొని ఉంది. ఆమె జడలో అంత వరకు అందంగా అమరిన మల్లెలు చెల్లా చెదురై పడివున్నాయి.

"అయితే రోజూ ఇంతే నన్నమాట." సుజా గొంతులో కోపం,

దుఃఖం బాగా ధ్వనించాయి.

"అని చెప్పలేను . నేనేమీ ప్రభుత్వ ఉద్యోగిని కాదు. ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం ఎంత పని చేస్తే అంత లాభం, డబ్బు, ప్రమోషన్. "

"ఎందుకండి సుఖంలేని ఇటువంటి ఉద్యోగం. చిన్న ఉద్యోగమైనా టైము కి వెళ్ళి టైముకు వస్తే బాగుంటుంది. ఉద్యోగం మనకోసం, మనబ్రతుకుకోసం గానీ, మనం బ్రతకటం ఉద్యోగం కోసం కాదు కదండీ."

సుజా మాటలు నిజమేననిపించాయి. జీతం తక్కువైనా ఓ చిన్న ఉద్యోగం చూసుకుంటే బాగుంటుందేమో అనిపించింది మధుకి.

ఆ ఆలోచన ఆచరణలో పెట్టేలోగా వచ్చిందో ప్రమోషన్, దానితో పాటే కొంత డబ్బు, కొన్ని అదనపు సదుపాయాలు.

వాటిని ఒదులు కోలేక పోయాడు.

మళ్ళీ రోజులు మ ామూలే.

"సుజా ఏదో బాధపడుతోందిరా" ఓసారి అక్క మాయింటికి వచ్చినప్పుడు అంది.

"ఏంటక్కా?"

"అదే నీ గురించే" అక్క ఓసారి ఆగి అంది. "అదేమో చిన్నపిల్ల. పెళ్ళయిన కొత్త. దానికి సరదాగా తిరగాలని ఉంటుంది."

మధు ఏమీ అనలేదు. సుజా అక్కచేత చెప్పిస్తున్నట్లు అర్థమయింది.

"అది నువ్వు అర్థం చేసుకోవాలిరా. అర్ధరాత్రి వరకు ఆఫీసులో పడి ఏడవక పోతే పెందలాడే ఇల్లు చేరవచ్చుకదా?"

"ఆఫీసులో పడి ఏడవటం నాకు మాత్రం సరదా ఏంటక్కా?" అన్నాడు మధు. "పనిలో నా బాధ్యతలు నేను చూసుకోవద్దా?"

"ఏదో ఇతనొక్కడికే ఆఫీసులో బాధ్యతలున్నట్లు." సుజా వెట-

కారంగా అంది.

"అయినా ఇతనికి ఇల్లు అందంగా అమర్చటానికి పనికి వచ్చే గృహోప కరణాల్లో భార్యకూడా ఒకటికాబోలు."

"నువ్వూరుకో అమ్మాయ్ నేచెబుతున్నానుగా?"

"ఇంక ఊరుకొనేది లేదొదినగారు. ఏమండి మీ పద్ధతులు మార్చు-కోక పోతే నన్ను మా యింటికి పంపేయండి."

గొల్లున ఏడ్చింది సుజా.

"ఊరుకో అమ్మాయ్" అక్క సుజా కళ్ళు తన చీర కొంగుతో వత్తుతూ అంది. "ఇంకెన్నాళ్ళు ఇలా ఆఫీసులో ఏడుస్తాడులే. మరో ఆరునెలలు ఆగితే వస్తాడుగా వాడి వంశోద్ధారకుడు. వాడేవీడిని మార్చి దారిలోకి తెస్తాడులే."

కానీ అలా జరగలేదు. బుజ్జిగాడు పుట్టకముందే జనరల్ మేనేజ-ర్‌గా ప్రమోషన్ వచ్చింది.

బుజ్జి గుర్తురాగానే నిద్రమత్తు వదలి పోయింది మధుకి. కళ్ళు తెరచి చూసాడు. ఇంటికి ఇంకా చాలా దూరమేవెళ్ళాలి.

"తొందరగా పోనీవోయ్. ఏంటాకారు నడపటం?" కారు నెమ్మ-దిగా పోతున్నట్లు తోచింది మధుకి.

"ఎనభైలో ఉందండీ, రోడ్డు క్లియర్ కదా?" డ్రైవర్ అదోలా నవ్వాడు.

బుజ్జిగాడిని ఇంటికి తెచ్చిందో, లేదో?

మధు ఆలోచనలు బుజ్జిగాడి చుట్టూ తిరిగాయి "అబ్బాయి జాతకం, చాలా గొప్పది." వాడి జాతకం వ్రాసిన జ్యోతిష్యుడు అన్నాడు. ఆమాటలు గుర్తొచ్చాయి.

"నిండా నూరేళ్ళ ఆయువు. చంద్రునిలాగా యశోకిరణాలు వెద-జల్లు తాడండీ."

దీపాలు లేని రోడ్డు మీద చిరువెన్నెల పడుతోంది. నిండు వెన్నెల

కాదు. అమావాస్య తరువాత విరిసిన పంచమి చంద్రుని వెన్నెల; పున్నమి చంద్రునిగా ఎదగవలసిన పంచమి చంద్రుని వెన్నెల.

అయినా ఎంత హడావిడిగా గడిచిపోయిందీ రోజు !

ఫోన్ మ్రోగింది. హటాత్తుగా మాటలు ఆగిపోయాయి.

గురుతరమైన విషయాలు చర్చిస్తున్న ఆగదిలో నిశ్శబ్దం నిండిపోయింది. డైరక్టర్స్ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. అక్కడ ఉన్న వాళ్ళందరి కన్నా తక్కువ స్థాయిలో ఉన్న మధే ఫోనెత్తాడు.

"సార్ మీకు అర్జంటు ఫోన్‌కాల్ ఓసారి రూమ్‌కి వస్తారా?" అవతల నుంచి సెక్రటరీ గొంతు.

"మన్నించండి. ఓనిముషం" కాన్ఫరెన్స్.రూమ్ బయటకు వచ్చాడు మధు.

"మేడమ్‌గారు లైన్లో ఉన్నారండి" ఫోన్ ఇస్తూ అన్నాడు సెక్రటరీ.

"ఏమండీ" అవతలనుంచి సుజా గొంతు. చాలా కంగారుగా వినిపించింది. "బుజ్జిగాడికి ఏమీ బాగోలేదండీ. కళ్ళు తేలవేస్తున్నాడు."

"డాక్టర్‌కి చూపించక పోయావా?"

"చూపించానండీ. హాస్పటల్‌లో చేర్చాలంటున్నాడు."

"అలాగా......" మధు ఓనిముషం ఆగాడు.

"నాకు చాలా కంగారుగా ఉందండీ. మీరోసారి వస్తే......"

"నేనా...... చూడు సుజా, ఎమ్.డీ. గారు ఉన్నారు. డైరక్టర్ల మీటింగ్ అవుతోంది. ఓగంటలో వచ్చేస్తాను. నువ్వు బుజ్జిగాడిని 'అపోలో'కి తీసుకెళ్ళు డ్రైవరు అక్కడే వున్నాడు కదా?"

"ఉన్నాడండి"

"నేను 'అపోలో'కి ఫోన్ చేస్తాలే నువ్వేం కంగారు, పడకు."

సుజా వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లు వినబడింది మధుకి. అతనేం చెయ్యగలడు.

డైరక్టర్స్ మీటింగ్ జరుగుతోంది. రాబోయే సంవత్సరంలో సాధించాల్సిన ఉత్పత్తి గురించి చర్చిస్తున్నారు. హటాత్తుగా ఇప్పుడు మీటింగ్ మధ్యన వదిలి పెట్టి వెళ్ళాలంటే ఎలాగ?

సుజా ఫోన్ పెట్టేసింది.

గది తలుపు తీసి బయటకు వచ్చాడు మధు.

కొన ఊపిరితో పశ్చిమాన పడిఉంది వెలుగు నిచ్చిన పగలు.

"ఎనీథింగ్ సీరియస్" రూమ్‌లోకి అడుగుపెట్టగానే అడిగాడు ఎమ్.డీ.

"నో.నో." మెల్లగా గొణిగాడు మధు. చర్చమళ్ళీ ప్రారంభముయింది. తక్కువ ధరకు అధికోత్పత్తి ఎలా సాధించాలనే దాని గురించి ఏ వేవో మాట్లాడారు డైరెక్టర్స్. మధుకి ఏమి బుర్రకెక్కడం లేదు. ఏవేవో నిర్ణయాలు తీసికొన్నారు.

"ఈ రోజుకింక ఆపేద్దాం" చర్చించాల్సిన విషయాలు పూర్తయాక ఎమ.డి. అన్నారు. "పాపం మన మధు అలసిపోయినట్లున్నాడు. చాలా డల్‌గా ఉన్నాడు."

నాగురించే ఆచర్చలు, అప్పడే ఆపేస్తున్నట్లు అనిపిస్తుంది ఎమ్.డీ. గారి మాటలు విన్నవారికి.

ఆధునిక యాజమాన్యపు పద్ధతిలో కనిపించే ఆ ఆత్మవంచన చూసి మధుకి నవ్వాలో, ఏడ్వాలో తెలీలేదు.

"కారు వెంటనే రెడీ చెయ్యమను." బ్రీఫ్‌కేస్ సర్దుకొంటూ సెక్రటరీతో చెప్పాడు మధు.

బుజ్జిగాడెక్కడున్నాడో.

"అపోలోకి పోన్ చేసావా?"

"అపోలో ఫోన్ అవుటాఫ్ ఆర్డర్ సార్." సెక్రటరీ అన్నాడు. "ఇంటికి ఫోన్ చేస్తే రెస్పాన్స్ లేదు సార్."

బ్రీఫ్‌కేస్ పట్టుకొని గబగబా మెట్లుదిగాడు మధు. ఇంకో గంటలో

ఇల్లు చేరుకోవచ్చు. బుజ్జిగాడిని చూడవచ్చు.

మధు కారులో కాలు పెట్టాడో లేదో హటాత్తుగా దీపాలన్నీ ఆగి-పోయాయి.

అంతా చీకటి.

కర్మాగారం నుంచి స్టీమ్ వదిలే శబ్దమూ, ఆపరేటర్స్ అటూ, ఇటూ పరుగెత్తే శబ్దమూ వినిపించాయి.

కర్మాగారంలో కరంటు పోయిందన్న మాట!

ఓ నిముషం ఆలోచించాడు ఏంచెయ్యాలి? అటు కర్మాగారానికి వెళ్ళి పవర్ పోయినందుకు కారణాలు వెదకటమా? ఇంటికి వెళ్ళటమా?

బుజ్జిగాడెలా ఉన్నడో? ఆస్పత్రినుంచి ఇంటికి తెచ్చారో, లేదో?

ఉద్యోగమే జీవితంగా మారిపోయిన అతనికి నిర్ణయం తీసుకో-టానికి ఎంతోసేపు పట్టలేదు. బ్రీఫ్ కేసు కార్లో వుంచి పరుగెత్తాడు కర్మాగారం వైపు.

సమస్య ఏమిటో తెలుసుకునే సరికి ఓ గంట పట్టింది. దీపాలు వెలిగాయి.

శారీరకంగానూ, మానసికంగానూ అలసిపోయిన మధు కారులో కూలబడ్డాడు.

రోడ్డు మలుపు తిరిగి కారు టౌన్ చేరుకంది.

ఇంటికెళ్ళాలా, ఆస్పత్రికెళ్ళాలా? అని ఆలోచించేలోపే ఇంటి వేపు తిరిగి పోయింది కారు.

దూరంనించి ఇల్లు కనిపించింది. కారు పోర్టికోలోనూ, ఇంటి-లోనూ లైట్లు వెలుగుతున్నాయి.

"అమ్మయ్య" అనుకున్నాడు. బుజ్జి ఇంటికి వచ్చేసి ఉంటాడు. సుజా అనవసరంగా ఎంతో కంగారు పడిఉంటుంది.

కారు ఆగింది. హడావిడిగా డోర్ తెరచు కొని కారు దిగాడు

మధు, డ్రైవర్ కన్నా ముందు.

దూరాన ఆకాశాన చరమ శయ్యలో పడిఉన్నాడు పంచమి చంద్రుడు. ఆత్మీయులైన తారాంగనలు అతని చుట్టూ మూగి ఉన్నారు.

ఇంటి నిండా జనం ఉన్నారు.

"ఏమిటీ సంగతి?"

మెట్లు ఎక్కుతుంటే ఏవేవో మాటలు వినిపించాయి.

"బుజ్జిగాడి నాన్న కనిపించడేం?" ఓ కంఠం.

"ఇంకా ఆఫీసు నుంచి రాలేదట!" మరో కంఠం.

"అదేం ఆఫీసో, ఏం ఉద్యోగమో అర్థం కావటం లేదు. చంటి-వాడు చావు బ్రతుకుల్లో ఉన్నప్పుడు కూడా ఉద్యోగమే!"

"ఏమో బాబు. మేమూ చూసాము. చాలా మంది ఆఫీసర్లని. కానీ ఇతగాడిలాంటి వాడిని ఎక్కడా చూడలేదు. ఎవరైనా బ్రతుకు గురించి ఉద్యోగం చేస్తారుగానీ, ఇతనిలా ఉద్యోగం కోసం బ్రతుకు తారా? "

"మన కెందుకు లేమ్మా" ఓ ముసలమ్మ గొంతు. "అయినా అతను ఉంటే మాత్రం ఏం చేస్తాడు. ఒచ్చే యముడిని ఆపుతాడా ఏంటీ?"

నాగుండె గుబుక్కుమంది.

"ఏం చెయ్యక పోయినా అమ్మాయికి ధైర్యం కదా? చివరి క్షణంలో తండ్రి దగ్గరున్నాడు అన్న సంతృప్తి ఉంటుంది కదా?"

"నిజంగా ఆఫీసులోనే ఉంటే రాడేంటీ? అమ్మాయి ఫోన్ చేసిం-దట కదా? ఆఫీసులోనే ఉన్నాడో, మరెక్కడున్నాడో?"

గుండెల్లో గునపం దిగినట్టయింది మధుకి. తల వంచుకుని ఇంటి-లోకి వెళ్ళాడు.

"ఏమండీ మన బుజ్జిగాడు......" గొల్లుమని ఏడుస్తూ అతని మీద

పడింది సుజా.

ఆమెని ఓదారుస్తూ తల ఎత్తి చూసాడు. అంతవరకు చిరువెన్నెల నందించిన పంచమి చంద్రుని మృతదేహం ఎదురుగా పడిఉంది. ఆ మృత దేహాన్ని చూసి తారాంగనలు కార్చిన కన్నీటి బిందువులు, మంచుబిందువులుగా పడుతున్నాయి.

* * *

"ఇలాగోళ్ళు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చున్నారేమిటి? ఆఫీసుకి వెళ్ళరా?" బుజ్జిగాడు పోయినెల రోజులు గడిచి పోయినా ఆఫీసుకి వెళ్ళని మధుని చూసి అడిగింది సుజా. "మీరెళ్ళక పోతే ఫేక్టరీ ఎలా నడుస్తుందండీ."

"సుజా......"

"మీరు బ్రతికేది ఉద్యోగం కోసం కదండీ?"

"నేను ఆ ఉద్యోగం మానేసాను."

"జోక్ చేస్తున్నారా? వద్దండీ." సుజా అంది.

"మీరు భార్య బిడ్డలనైనా వదిలేస్తారు గానీ ఆ ఉద్యోగం వదిలేస్తారా?"

"లేదు సుజా. నిజంగానే వదిలేసాను. నాకిప్పుడు తెలిసింది ఉద్యోగం బ్రతుకు గురించేనని, మనం ఉద్యోగం కోసం బ్రతక కూడదనీ. అందుకే ఈ ఉద్యోగం వదిలేసాను. బ్రతకటానికి ఏదో ఓపని చూసుకోవచ్చులే."

"నిజమేనా?"

"నిజమే"

గదిని అలుముకున్న చీకటిని తొలగిద్దామని లేచి లైటు 'వేసాడు. అది వెలగలేదు. బల్బు ఫ్యూజ్ అయిపోయింది.

* * *